క్లుప్తంగా

పింఛన్లు మంజూరు చేయండి



గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

జి.సిగడాం: గ్రామాల్లో అర్హులైన వితంతువులు, వృద్ధులకు పింఛన్లు మంజూరు చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తి కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో పేడాడ కృష్ణవేణి, కరగాన నీలమ్మ, హనుమంతు ఈశ్వరమ్మ, వడిశ లక్ష్మిలతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. భర్తలు మరణించి చాలాకాలం అవుతున్న పింఛన్లు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీకాంత్

జి.సిగడాం: విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని తహసీల్దార్ ఎం.శ్రీకాంత్ అన్నారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాంగా అమలు చేస్తున్న గ్రీవెన్స్ సెల్ కార్యక్రమంలో ఎవరైనా ఫిర్యాదు చేస్తే తక్షణమే పరిష్కారం అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో రైతులకు నెలకున్న భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజల నుంచి సమస్య వచ్చిన వెంటనే సంబంధిత కార్యదర్శులు, వీఆర్వోలు, ఆర్ఐలు పరిష్కారం అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఎస్ఐ వై.మధుసూదనరావు, డిప్యూటీ తహసీల్దార్ ఎస్.నిర్మల సిబ్బంది ఉన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

జి.సిగడాం: గ్రామాలకు మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. మండలంలోని సంతవురిటి నుంచి విజయరాంపురం, సీతారాంపురం నుంచి సంతవురిటి, టీడీవలస నుంచి నక్కపేట గ్రామాలకు వెళ్లే రహదారులకు సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బుడారి లక్ష్మణరావు, వడిశ మహేశ్వరరావు, ధారబోయిన రెయిమ్మ, పలిశెట్టి సూర్యనారాయణ, మాజీ ఎంపీపీలు బాలబొమ్మ మహాలక్ష్మి, టంకాల లక్ష్మి, బాలబొమ్మ వెంకటేష్, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, ఎంఎంఎస్ అధ్యక్షురాలు శిర్రా లక్ష్మి, నాయకులు కుమరాపు రవికుమార్, పైల విష్ణుమూర్తి, డీఈఈ శ్రీరాములు పాల్గొన్నారు.

మూడు రోజుల పాటు అన్నప్రసాద వితరణ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రథసప్తమి పురస్కరించుకొని ఫిబ్రవరి 2, 3, 4 తేదీల్లో అరసవల్లిలో శ్రీసూర్యస్నేహ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు అరసవల్లి ట్రస్ట్ సభ్యులు డబ్బీరు శ్రీనివాసరావు, అధ్యక్షుడు మల్లేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల పాటు సుమారు 15వేల మందికి అన్నప్రసాద వితరణ చేయనున్నామని పేర్కొన్నారు.

జంగిల్ క్లియరెన్స్



సాక్షి ఎఫెక్ట్...

ఖాళీ స్థలంలో తుప్పలు తొలగించిన దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలోని బ్యాంకర్స్ కాలనీలో ఇళ్ల మధ్య తుప్పలు పేరుకు పోయాయని తెలుపుతూ 'తుప్పలు తొలగించరూ' అనే శీర్షికతో సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం తప్పలు, కాలువలో పూడికలు తొలగించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

జిల్లా కబడ్డీ జట్ల ఎంపికల రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సీనియర్స్ పురుషులు, మహిళల కబడ్డీ జట్ల ఎంపికలు ఈనెల 22వ తేదీన జరగనున్నాయని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు యార్లగడ్డ వెంకన్నచౌదరి, కార్యదర్శి అకేన చిరంజీవిరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణంలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి ఈ ఎంపికల ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులకు ఎలాంటి వయో నిబంధనలు లేవని పురుషులు 85 కేజీలు, మహిళలు 75 కేజీల లోపు బరువు ఉండాలని స్పష్టం చేశారు. ఇక్కడ ఎంపికైన జిల్లా జట్లను జనవరి 25 నుంచి 27 వరకు విశాఖపట్నంలో జరిగే 71వ ఏపీ రాష్ట్రస్థాయి (అంతర్‌జిల్లాల) సీనియర్స్ కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీలకు పంపిస్తామని వెల్లడించారు. రాష్ట్రపోటీల్లో రాణించే క్రీడాకారులను ఫిబ్రవరి 20 నుంచి 23 వరకు ఒడిశాలో జరిగే జాతీయ సీనియర్స్ కబడ్డీ పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 77027 42399, 99639 58848, 89859 50912 నంబర్లను సంప్రదించాలన్నారు.

పశువుల ఆరోగ్యమే లక్ష్యంగా..!

- గ్రామాల్లో పశువైద్య శిబిరాలు
- ఈనెల 31 వరకు నిర్వహణ
- వినియోగించుకోవాలని అధికారుల సూచన

మండలం	పంచాయతీలు	అన్నిరకాలు పశువులు
ఎచ్చెర్ల	28	22,550
లావేరు	33	32,650
జి.సిగడాం	31	23,450
రణస్థలం	32	32,300



ఎచ్చెర్లలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం



ఆవులకు వైద్యం చేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్:

ప్రస్తుతం గ్రామాల్లో పశు పోషణకు ప్రాధాన్యత పెరుగుతోంది. రైతులు, స్వయం సహాయ సంఘాల మహిళలు, నిరుద్యోగ యువత సైతం డెయిరీలు నిర్వహిస్తున్నారు. రైతులు పాడి పశువుల పోషణ వల్ల పాల అమ్మకం ద్వారా ఆదాయం పొందడంతో పాటు పశువుల ఎరువును గత్తంగా పొలాలకు వినియోగించుకుంటున్నారు. దీంతో ఎచ్చెర్ల నియోజకవర్గంలోని ఎచ్చెర్ల, జి.సిగడాం మండలాల్లో ఆవులు, గేదెల పెంపకానికి రైతులు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. అలాగే రణస్థలం, లావేరు మండలాల్లో అవులు, గేదెలతో పాటు గొర్రెలు, మేకల పెంపకానికి సైతం ప్రాధాన్యతనిస్తున్నారు.

ఈనెల 31 వరకు ఆరోగ్య శిబిరాలు

పశు సంవర్ధక శాఖ పశువైద్య ఆరోగ్య శిబిరాలు సోమవారం నుంచి గ్రామాల్లో ప్రారంభించింది. ఈనెల 31వ తేదీ వరకు శిబిరాలు నిర్వహిస్తారు. ప్రతీ గ్రామంలో పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తారు. ప్రధానంగా పశువులు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలు జబ్బవాపు, గొంతువాపు, చర్మవ్యాధి, గాలికుంటు వ్యాధి వంటివాటికి చికిత్సలు నిర్వహిస్తారు. అయితే వైద్య శిబిరాల ముందస్తు సమాచారం లేకపోవడంతో కొన్నిచోట్ల పాడి రైతులు అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలు వస్తున్నాయి. మరోపక్క కావాల్సిన మందుల కొరత వల్ల మందులను షాపుల్లో కొనుక్కోవాల్సి వస్తోంది. అందువలన పశు వైద్య శిబిరాల నిర్వహణలో పోషకులకు ముందస్తు సమాచారం, అవసరమైన చికిత్స, మందులు అందుబాటులో ఉంచాలని పాడి రైతులు కోరుతున్నారు. వైద్య శిబిరంలో అవసరమైన మందులు అందుబాటులో ఉండకపోతే ఈ శిబిరాలు వల్ల ప్రయోజనం సైతం ఉండదు. ప్రజలు పశువైద్యం కోసం గ్రామీణ ప్రాంతాల్లో ప్రైవేట్ వ్యక్తులపైనే ఎక్కువగా ఆధారపడే పరిస్థితులు ఉన్నాయి.

సద్వినియోగం చేసుకోవాలి



ఈనెల 20వ తేదీ నుంచి 31వ తేదీ వరకు గ్రామీణ ప్రాంతాల్లో పశువైద్య శిబిరాలను పశు సంవర్ధక శాఖ నిర్వహిస్తోంది. వీటిని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి. అన్ని రకాల పశువులకు చికిత్స నిర్వహణ ఉంటుంది. అవసరమైన మందులు సైతం అందుబాటులో ఉంచాం. ప్రధానంగా పాడి అవులు పెంపకం చేస్తున్నవారు ఉపయోగించుకోవాలి.

– కె.రాజగోపాలరావు, జాయింట్ డైరెక్టర్, జిల్లా పశు సంవర్ధక శాఖ

మందులు అందుబాటులో ఉంచాలి



పశు వైద్య శిబిరాల్లో ప్రధానంగా మందులు కొరత ఉంది. రైతులు ప్రైవేట్‌గా మందులు కొనుగోలు చేస్తున్నారు. ఇలా కాకుండా మందులు అందుబాటులో ఉంచాలి. వైద్య శిబిరాలు మొక్కుబడిగా కాకుండా పాడి రైతులకు ప్రయోజనకరంగా ఉండేలా చర్యలు చేపట్టాలి. రైతులకు ఉపయోగపడాలి.

– బెందు రామారావు, ముద్దాడ, ఎచ్చెర్ల

వైద్య సేవలు అవసరం



గ్రామాల్లో పశు పోషణకు ప్రతి ఒక్కరం ప్రాధాన్యం ఇస్తున్నాం. పశువులకు సీజనల్ వ్యాధులు, చూడు కట్టక పోవటం, దూడలకు జ్వరం వంటి ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. ఒక్కోసారి సకాలంలో వైద్యం అందక పోవటం వల్ల పశువులను నష్టపోతున్నాం. ముందస్తు సమాచారంతో పశువైద్య శిబిరాలు నిర్వహించాలి.

– సీహెచ్ రాజేశ్వరి, బొంతలకోడూరు, ఎచ్చెర్ల

నాక్ కోసం ముస్తాబు



ఎన్‌సీసీ కార్యాలయానికి రంగులు వేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో మినీ యూనివర్సిటీగా పేరుగాంచిన ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ముస్తాబవుతోంది. నాక్ పీయర్ కమిటీ ఈనెల 23, 24 తేదీల్లో కళాశాలను సందర్శించనున్న నేపథ్యంలో కళాశాల ప్రాంగణంతోపాటు భవనాలు, వివిధ విభాగాలు, కార్యాలయాలను ముస్తాబు చేస్తున్నారు. రంగులు పూస్తున్నారు. తుది మెరుగులు దిద్దుతున్నారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులు పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

– శ్రీకాకుళం న్యూకాలనీ



రంగులు వేస్తూ...



ముస్తాబవుతున్న కళాశాల ప్రధాన భవనం



ముస్తాబవుతున్న సిల్వర్ జూబ్లీ ఆడిటోరియం



కళాశాల మైదానంలో సిద్ధం చేస్తున్న 100 మీటర్ల రన్నింగ్ ట్రాక్



ముస్తాబైన కళాశాల ఆర్ట్స్, కామర్స్ కొత్త భవనం

కళాశాల అభివృద్ధికి కృషి

శ్రీకాకుళం న్యూకాలనీ: ఎంతో ఘన చరిత్ర కలిగిన శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలను మరింత ఉన్నత విద్యాసంస్థగా తీర్చుదిద్ది, దాని అభివృద్ధికి కృషి చేస్తామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. సోమవారం ఆయన కళాశాలను సందర్శించారు. కళాశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులు, కార్యక్రమాలను ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖతో కలిసి పరిశీలించారు. త్వరలో జాతీయ విద్యా ప్రమాణాల కమిటీ సందర్శన నేపథ్యంలో ఉత్తమ విద్యా ప్రమాణాల కేంద్రంగా కళాశాలను గుర్తించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణం విద్యాలయ ప్రాంగణంలో ఉండే విధంగా అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు సమష్టిగా కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు.

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

జి.సిగడాం: స్థానిక మోడల్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులను ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అభినందించారు. సోమవారం విద్యాలయంలో తాగునీటి కోసం ఎన్‌సీఎల్ పరిశ్రమ ద్వారా ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్‌ను ప్రారంభించారు. గత నెల 20న విద్యుత్ వినియోగదారుల కోసం ఇక్కడి విద్యార్థులు తీసిన లఘు చిత్రం రాష్ట్రస్థాయిలో నంబర్ వన్ స్థానం కైవసం చేసుకుంది. విజయవాడలో ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్, ఎండీ ఏపీజెన్‌కో కేవీఎన్ చక్రధర్‌బాబు చేతులమీదుగా తెలుగు అధ్యాపకులు కోట తిరుపతిరావు, విద్యార్థులు వి.వైకుంతరావు, డోల వరప్రసాదరావు, ఎ.ఈశ్వర్, ఆర్.తేజలు రూ.20 వేల నగదు, ప్రసంశాపత్రాలు అందుకున్నారు. ఆయనతో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యూల్ లెంక తదితరులు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరస్తున్న ఎమ్మెల్యే కూన, సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాల విద్య సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు నిరంతరం పాటుపడాలని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. సోమవారం నోబుల్ టీచర్స్ అసోసియేషన్ 2025 క్యాలెండర్‌తో పాటు డైరీని ఎమ్మెల్యే తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఎన్‌టీఏ ఆవిర్భావం, విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలపై చేసిన పోరాటాలు, ఫలితాలను సంఘ ప్రతినిధులు వివరించారు. కార్యక్రమంలో ఎన్‌టీఏ జిల్లా అధ్యక్షుడు సూర పాపారావు, ప్రధాన కార్యదర్శి శీపాన ముకుందరావు, జిల్లా గౌరవాధ్యక్షుడు గొర్లె భూషణరావు, వావిలపల్లి రాజారావు, బోజిగి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాల బలోపేతమే లక్ష్యం



మాట్లాడుతున్న మేనేజర్ మోహనరావు

ఎచ్చెర్ల క్యాంపస్: స్వయం సహాయక సంఘాల బలోపేతమే లక్ష్యంగా జిల్లా మహిళా సమాఖ్య, మండల మహిళా సమాఖ్య సబ్ కమిటీలు పనిచేయాలని వెలుగు సంస్థ జిల్లా సంస్థాగత నిర్మాణం మేనేజర్ మోహన్‌రావు అన్నారు. ఎచ్చెర్ల సాంకేతిక శిక్షణ కేంద్రంలో స్వయం సహాయ సంఘాల బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై మండల సమాఖ్య అధ్యక్షుడు, జిల్లా సమాఖ్య సభ్యులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. ఈ శిక్షణలో ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయి స్వయం సహాయ సంఘాలు బలోపేతం కావాలంటే వారికి అవగాహన అవసరమన్నారు. సంఘాలు సక్రమంగా పనిచేయడం, చదువుకున్న సభ్యులు వ్యాపారాలు, జీవనోపాధులకు ప్రాధాన్యతనివ్వడం, పారదర్శకంగా అకౌంట్ల నిర్వహణ వంటి అంశాలు కీలకంగా చెప్పారు. క్షేత్రస్థాయిలో సబ్ కమిటీలు వేసి, సంఘాలు బలోపేతం కావడం, ఆర్థిక ప్రగతి చెందేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఏరియా కో–ఆర్డినేటర్ రవికుమార్, ఏపీఎం భాగ్యలత పాల్గొన్నారు.


గ్లోబల్ విద్యాసంస్థల అధినేత ప్రసాద్ ఉదారత



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్, పక్కనే ప్రసాద్

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని గ్లోబల్ విద్యాసంస్థ అధినేత ప్రసాద్ తన ఉదారతను చాటుకున్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో చదువుకున్న ఆయన కళాశాల అభివృద్ధి, అలంకరణ కోసం కొబ్బరి మొక్కలను వితరణగా అందజేశారు. కళాశాల సుందరీకరణలో తాను భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. మొక్కలు అందజేసిన ప్రసాద్‌ను శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అభినందించారు. కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ, అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్వాసమీద ధ్యాసే ధ్యానం



కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు

ఎచ్చెర్ల: ధ్యానం అంటే శ్వాసమీద ధ్యాస అని బెంగుళూరు నుంచి విచ్చేసిన పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూమెంట్ సీనియర్ మాస్టర్ ప్రేమ్‌నాథ్ అన్నారు. సోమవారం పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూమెంట్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో ఎచ్చెర్ల కొండపై శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆత్మజ్ఞాన సందేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధ్యానం కోసం విశిష్టమైన సందేశాన్ని అందించారు. అనంతరం అక్కడకు వచ్చినవారిచే సామూహిక ధ్యానం చేయించారు. నిరంతరం ధ్యానం చేయడం వలన ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల, పొందూరు, శ్రీకాకుళం గ్రామాల నుంచి వచ్చిన సుమారు 100 మంది పాల్గొన్నారు.

ఎచ్చెర్ల ఐటీఐలో జాబ్‌మేళా రేపు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ఐటీఐలో ఎచ్చెర్ల నియోజకవర్గానికి సంబంధించి జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్, ఎంటర్‌ప్రైజెస్ డవలప్‌మెంట్ ఏపీ ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్ కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. పేటీఎం, నవతా రోడ్ ట్రాన్స్‌ఫోర్టు సంస్థలు హాజరు కానున్నాయన్నారు. పేటీఎంలో ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, నవతాలో క్లర్క్, డ్రైవర్, వెహికల్ హెల్పర్ ఉద్యోగాలు కల్పించనున్నట్లు చెప్పారు. 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్హత ఉన్నవారు హాజరు కావాలని తెలిపారు. రేషన్‌కార్డు, ఆధార్ విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్లు 90102 07240, 79891 77887లను సంప్రదించాలన్నారు.

పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలి



పుస్తకాల కౌంటర్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

గార: గ్రంథాలయంలో విలువైన పుస్తకాలను యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ సూచించారు. సోమవారం గార గ్రంథాలయంలో ఎర్రన్న విద్యాసంకల్పంలో భాగంగా అందించిన పుస్తకాల కౌంటర్లను ఆయన ప్రారంభించారు. పోటీ పరీక్షలకు యువత సన్నద్ధం కావాలన్నారు. అనంతరం కుమ్మరిపేట ప్రభుత్వ పాఠశాల సందర్శించి మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు.

విజయవంతం చేయాలి



గోడ పత్రికలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో ఈనెల 24, 25, 26 తేదీల్లో జరగనున్న రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని జిల్లా కన్వీనర్ బోర గోపి కోరారు. ఈ మేరకు గోడ పత్రికలను ఎమ్మెల్యే గొండు శంకర్, టూటౌన్ సీఐ ఈశ్వరరావు, ఎస్ఐ హరికృష్ణలు సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ మండల కన్వీనర్ జయప్రకాష్, టింకిల్ కుమార్, మధు, ఉదయ్‌కిరణ్‌లు పాల్గొన్నారు.

పరామర్శ



వీజీకే మూర్తి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వి.జి.కె.మూర్తి లాంటి మంచి వ్యక్తిని కోల్పోవడం బాధాకరమని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని వి.జి.కె.మూర్తి కుటుంబాన్ని సోమవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు.

సంక్షిప్తంగా...

అన్నప్రసాద వితరణ

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం నగరంలోని జిల్లా పరిషత్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో భాగంగా ఫిర్యాదులు ఇచ్చేందుకు వచ్చేవారికి సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో అన్నప్రసాద పొట్లాలను పంపిణీ చేశారు. సుమారు 220 మందికి ఆహారం అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాదళ్ కన్వీనర్ ఎం.భాస్కరరావు, సభ్యులు ఎల్.అప్పారావు, వి.సతీష్, ఉమాకాంత్ చౌదరి, వి.నాగేశ్వరరావు, ఎస్.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పశువులు పట్టివేత

రణస్థలం: జిల్లాలోని తిలారు సంత నుంచి విశాఖపట్నం అక్రమంగా తరలిస్తున్న మూడు పశువులను జేఆర్‌పురం పోలీసులు మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై రామతీర్థాలు కూడలి వద్ద సోమవారం పట్టుకున్నారు. ఒక వాహనాన్ని, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు. పశువులను కొత్తవలస గోశాలకు తరలించారు.

వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలి

రణస్థలం: వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో 53 రోజులుగా జగ్జీత్ సింగ్ దల్లెవాల్ నిరవధిక దీక్ష చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమని రైతు సంఘం, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం, వెలమల రమణ అన్నారు. కేంద్ర ప్రభుత్వం 2021 డిసెంబర్ 9న ఎస్.కె.ఎంకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సోమవారం విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు వ్యక్తిగత సెక్రటరీ చందక రమణకు వినతి పత్రం అందజేశారు.

రథసప్తమి ఏర్పాట్ల పరిశీలన

అరసవల్లి: ఫిబ్రవరి 2 నుంచి మూడు రోజుల పాటు జరగనున్న రథసప్తమి వేడుకలకు ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ మేరకు అరసవల్లి మిల్లు జంక్షన్ వద్ద ప్రత్యేకంగా సూర్యనమస్కారాల సూచికల ఏర్పాటుతో పాటు అరసవల్లి అసిరి తల్లి అమ్మవారి ఆలయం వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ సోమవారం నిర్వహణ ఏర్పాట్ల పనులను పరిశీలించారు. వేగంగా పనులు చేస్తున్న క్రమంలో నాణ్యతను కూడా పాటించాలని అధికారులను ఆదేశించారు. అలాగే సప్తమి విద్యుత్ అలంకరణ పనులు కూడా ప్రారంభమయ్యాయి. ఆయనతో పాటు యూత్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు దాసు నాయుడు, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

సొసైటీ భూమిని కాపాడండి

శ్రీకాకుళం పాతబస్టాండ్: నరసన్నపేటలో ది నరసన్నపేట కో–ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ భూమి ఉంది. ఆ భూమిని ఒక రాజకీయ పార్టీకి చెందినవారు ప్రభుత్వ సాయంతో ఆక్రమించేందుకు ప్రయత్నం చేస్తున్నారని, దానిని నిలుపుదల చేయాలని సొసైటీ అధ్యక్షుడు చింతు రామారావు, సభ్యులు గ్రీవెన్సులో సోమవారం ఫిర్యాదు చేశారు. సొసైటీ స్థలాన్ని కాపాడాలని కోరారు.

లెప్రసీ బాధితులను గుర్తించేందుకు సర్వే

అరసవల్లి: జిల్లాలో ఈనెల 20 నుంచి వచ్చే నెల 2 వరకు లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్‌ను చేపడుతున్నట్లుగా జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ టీవీ బాలమురళీకృష్ణ ప్రకటించారు. ఈ మేరకు స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద లెప్రసీ బాధితుల గుర్తింపు సర్వేను సోమవారం ఆయన ప్రారంభించారు. అదనపు డీఎంహెచ్‌వో తాడేల శ్రీకాంత్, డిప్యూటీ డీఎంహెచ్‌వో మేరి కేథరిన్, డీపీఎంవో వాన సురేష్ కుమార్, డాక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.